


# అసందిగ్ధ కర్తవ్యం

ఆడెపు లక్ష్మీపతి

"ఇంత ఆలస్యంగానా రావడం?" శకుంతల అడిగింది నా చేతుల్లోంచి పార్సెల్ ప్యాకెట్టు అందుకుంటూ. జనంతో కిటకిటలాడుతున్న ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో విరామ సమయపు రణగొణధ్వనులు నిప్పురవ్వల్లా ఎగిసి పడుతున్నాయి- నా ఒళ్లంతా చెమటధారలు.

"ఇక్కడ ప్రోగ్రాములూ లేటుగానే ఆరంభమయ్యాయి," చెప్పాడు కన్నడు. "మీ జనరల్ మేనేజర్, మిగతా ఆఫీసర్లు గబగబ ఉపన్యాసాలిచ్చి అర్జంటుగా స్టేజీ దిగి వెళ్లిపోయారు. ఫ్యాక్టరీలో ఏదో యాక్సిడెంటయ్యిందంట కదా నాన్నా?"

అప్పుడప్పుడు అవుతూంటాయి. సవాలక్ష కారణాలు. "నాకోసం ఏదైనా ఎనౌన్సుమెంటిచ్చారా?" అనడిగాను.

ఒక క్షణం నా ముఖంలోకి చూసింది శకుంతల. "ఎవ్వరూ ఇవ్వలేదు- కానీ నేనే ఇద్దామనుకున్నా అర్ధగంట క్రితం..." అని కిసుక్కున నవ్వింది. "అనుపమ తన కాస్ట్యూమ్స్ అన్నీ పట్టుకు వెళ్లింది కానీ తెల్లరిబ్బన్లు మర్చిపోయింది. అవి అందజెయ్యడానికి మీరు ఎపుడొస్తారా అని ఎదురుచూశాను. మీరు ఇంటా లేరాయె- బయటా లేరాయె. చివరికి కన్నడే గ్రీన్‌రూమ్‌లోకి వెళ్లి ఇచ్చాడు వాటిని..."

"అబ్బ... మేకప్‌లో అక్క చాలా వెరైటీగా, బ్యూటీఫుల్‌గా ఉంది నాన్నా! అక్కకు తప్పకుండా ప్రైజు వస్తుందీ డ్రామాలో!" మురిపెంగా అన్నాడు కన్నడు.

థియేటర్‌లో ఒకపక్క లైట్లారిపోయినై. డౌన్ స్టేజి ఫ్లడ్‌లైట్లు ప్రకాశవంతమైన వెలుతురుని ఎత్తి గుమ్మరిస్తుంటే కుంకుమ పూరంగు సిల్కుతెరలు దింపిన రంగస్థలం ఎర్రగా మండుతూన్న దీర్ఘ చతురస్రంలాగా కనబడుతోంది. ప్రయోక్త ఒకావిడ కర్టెన్ల చీలికలోంచి సన్నటి నీటిధారలాగా మైకు ముందుకొచ్చి, తరువాతి కార్యక్రమం- హైస్కూలు పిల్లలు ప్రదర్శించబోయే ఏకాంకిక- చిట్టచివరి యుద్ధం అని ప్రకటించి, ఆ నాటిక సారాంశాన్ని మూడు నాలుగు వాక్యాల్లో వివరించనారంభించింది. "ఒకవేళ మూడో ప్రపంచయుద్ధం గనుక సంభవించి పరస్పర మత, జాతి విద్వేషాలతో వివిధ దేశాలు ఒకదానిపై మరొకటి వినాశకర అణ్వస్త్రాలు, జీవ రసాయనిక ఆయుధాలు ప్రయోగించుకున్నట్లయితే... ఆ భయంకర విధ్వంసం తర్వాత ఈ భూమండలం మీద ఏమి మిగులుతుంది? అప్పుడు పరిస్థితులు ఎలా ఉంటాయి...?

ఇక నేనా మాటలేవీ వినదల్చుకోలేదు. కళ్లు మూసుకుని ఆలోచనల్లో పడ్డాను. మనిషి జీవితంలో ప్రతి అడుగూ ఒక యుద్ధరంగమే. ఆశలకూ, ఆశయాలకూ నడుమ నిరంతర సంగ్రామమే. అంతరాత్మ ప్రబోధానికీ, కెరీరిస్టు ప్రలోభానికీ మధ్య సంకుల సమరమే!

"సమోసాలు రుచిగా, కరకరమంటూ చాలా బావున్నాయండీ! ఏ హోటల్ నుండి కొనుక్కొచ్చారో... మెల్లగా మీరూ ఒకటి నములుతారా?" అంటున్న శకుంతల బలిష్టమైన దవడల నడుమ మరో సమోసా సర్రున చీలింది. కన్నడు తన చిట్టిపళ్ల కింద మసాలా చెగోడీల్ని కటకటమంటూ వేగంగా నలగగొడుతున్నాడు. నేను చటుక్కున ముఖం పక్కకు తిప్పుకున్నాను. నా ముఖం ఎముకల కుహరాల్లో గరుకు సానపు రాతిచక్రం గిర్రున తిరుగుతూ, వడిగా పరుగెత్తుతూ, నరాల్ని అడ్డంగా కోస్తున్నప్పటి బాధాకరమైన అంతర్గత సంగీతం మళ్లా మొదలయ్యింది.

రెండు గుక్కల మంచినీళ్లు గడగడా తాగేసి, బాటిల్ నావైపు సాచింది శకుంతల. నేను వద్దని వారించాను. నానోట్లో నిప్పుకణికె లాంటిదేదో నాలుక మీద దొర్లుతూ దవడల్నీ, కపాలాన్నీ కాల్చుతున్నట్టు దుర్భరమైన బాధ. మెడ కింద చేతులు పెట్టుకుని, కాళ్లు బార్లా చాపి రిలాక్స్‌డ్‌గా కూర్చునే ప్రయత్నం చేశాను.

''డాక్టర్ మళ్లా ఎప్పుడు కలవమన్నారు?'' అడిగింది శకుంతల.

*

లోపల ట్యూబ్‌లైట్ల కాంతిని తెల్లగా ప్రతిఫలిస్తున్న గోడలు. నున్నటి పాలరాతి ఫ్లోరింగు. ఫ్యాన్ల గాలికి అల్లల్లాడుతున్న మందపాటి ఆకుపచ్చ కర్టెన్లు. వాటి సందుల్లోంచి కనపడుతున్న గదులు, డోర్ల మీద డిపార్టుమెంటుల, డాక్టర్ల పేర్లు, డిసిన్‌ఫెక్టంటుల, చక్కని పెర్ఫ్యూముల వాసన కలయ తిరుగుతున్నప్పటికీ, అదోరకం గెదడు, నీచువాసన లోపల్నుంచి అలలు అలలుగా స్పిరిట్ ఆవిరితో కలగలిసి ఉండి ఉండి వీస్తోంది. వాటర్ ఫిల్టరున్న మూలన గోడనున్న టి.వి.లో ఏదో వైల్డ్‌లైఫ్ ఛానెల్ ప్రసారమవుతోంది. క్లోజప్‌లో దృశ్యం- బారుగా తెరుచుకొన్న పొడవాటి దవడలు, బాకుల్లాంటి తెల్లని కోరలు, అడవిదున్న వెనుక తుంటిని నోట్లో చిక్కించుకుని నీళ్లల్లోకి లాగింది మొసలి. భయవిహ్వలయై కొద్దిసేపు పెనుగులాడి గుడ్లు తేలేసింది దున్న. జలజలా నీళ్లలో కరుగుతున్న నెత్తుటి ధార. నేను చప్పున ముఖం తిప్పుకొని దవడలు బిగించాను.

''నెక్స్ట్ నెంబర్... మీరే,'' అంటూ నావైపు చూసింది రిజిస్ట్రేషన్ కౌంటర్‌లోని అమ్మాయి.

లోపలికి నడిచి, కుడి వైపు తిరిగి, విశాలంగా ఉన్న గదిలో ప్రవేశించాను. అక్కడున్న సీనియర్ డెంటిస్టు తల పంకిస్తూ నవ్వి, తన తెల్లకోటు, ముఖాన మాస్క్ సవరించుకుంటూ నన్ను కూర్చోమని సైగ చేశాడు. పొడవైన డెంటిస్టు ఛైర్‌లో జారిగిలబడి కూర్చుని నోరు తెరిచాను. లైట్ ఫోకస్ చేసి, తన పని ముట్లతో నా పళ్ల మధ్య కెలికి, గీరి, సున్నితంగా కొట్టాడు డెంటిస్టు. నొప్పి ఎక్కడ, ఎప్పట్నుంచి, ఏ ఉద్యోగం, ఎలాంటి అలవాట్లు అని అడిగి సమాధానాలు రాబట్టాడు. కింది దవడ ముందు పళ్లకి ఎక్స్-రే తీశాడు. పావుగంట పోయాక ఫిల్ము పరిశీలిస్తూ అడిగాడు.

''ఎవరైనా బలంగా కొట్టారా మిమ్మల్ని?''

నాకేమీ అర్థం కాలేదు. తుపుక్కున ట్రేలో ఊసి, ''వాట్ డు యూ మీన్!''

''ఐ మీన్,'' చిన్నగా నవ్వాడు డెంటిస్టు. ''ఏదైనా దెబ్బ తగిలిందా అని!'' క్షణమాలోచించాను. అయోమయంగా తోచింది. తల అడ్డంగా ఊపాను.

''మీకు జ్ఞాపకం ఉండి ఉండదు. ఇప్పుడు జ్ఞాపకం తెచ్చుకొనే ప్రయత్నమేమీ చెయ్యనక్కర్లేదు.'' చెరగని చిరునవ్వుతో అన్నాడు డెంటిస్టు. ''దీన్ని 'రిసార్ప్షన్' అంటారు. గడప తట్టుకొని కింద పడ్డప్పుడో, కర్ర లేదా రాడ్‌లాంటివి తగిలినప్పుడో, ముష్టిఘాతం తాకినప్పుడో గదువ పైన బలంగా దెబ్బ తగుల్తుంది. ముందరి పళ్ల మూలాలు కదులుతాయి. ఈ దెబ్బ కొన్ని సంవత్సరాల కిందటిది అయి ఉంటుంది...''

నా కన్నా ముందొచ్చిన మహిళా పేషంటు ఒకావిడ అవతలి ఛైర్‌లో కూర్చొనుంది. ఆమె పళ్లను పరిశీలించిన కుర్ర డెంటిస్టు- ట్రీట్‌మెంటులో మొదటి చర్య కాబోలు దవడకు ఇంజక్షను గుచ్చాడు. ఆమె మెడ కోస్తున్న గొర్రెలాగా గట్టిగా మూల్గింది. నా గుండె దడదడమని, కంఠంలో నరాలు జివ్వుమని లాగాయి.

''నా నొప్పి మొన్నట్నుంచే మొదలయ్యింది డాక్టరుగారూ!'' అన్నాన్నేను.

''దటీజ్ ఓ.కే. మీ చిన్నతనంలో తాకిన దెబ్బ, గాయం మానాయి. కానీ లోపల రక్తం పేరుకుపోయి, బ్యాక్టీరియా చేరి, సిస్టు తయారయింది. పంటి మూలాన్ని తినేస్తుంది. నౌ యువర్ ప్రాబ్లెమ్ ఈజ్ దట్ మానిఫెస్టేషన్ ఓన్లీ...''

''ఇప్పుడు ఏమిటి చెయ్యడం?''

''భయపడకండి. పళ్లు పీకెయ్యాల్సిన అవసరం లేదు. రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్ చేస్తాను నాలుగు పళ్లకి. ఆ తర్వాత క్రౌన్లు వేస్తాను. మొత్తం అయిదారు సిట్టింగులకి రావాల్సి ఉంటుంది రెగ్యులర్‌గా,'' అన్నాడు డెంటిస్టు.

*

''యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ రాశాడు. మర్నాడు రమ్మన్నాడు. అంటే ఇవాళ మొదటి సిట్టింగు మిస్డ్,'' అన్నాను.

''పోనీయండి. రేపట్నుంచి రెగ్యులర్‌గా వెళుదురుగానీ,'' అంది శకుంతల.

''ఇప్పుడు నొప్పి తగ్గిందనుకుంటా. కొంచెం కొంచెం ఏమైనా తినకుండా ఎలా వుంటారు?''

''తరువాత చూద్దాం. కాసేపు ఆగు.''

''సరే. రెండు సమోసాలు కన్నడి దగ్గర ఉంచుతాను. లేకుంటే అన్నీ నేనే తినేస్తానేమో. అంత కమ్మగా ఉన్నాయివి,'' అని కన్నడి వేపు తిరిగింది శకుంతల.

చుక్కలవేపు చూస్తూ ఆలోచనలో పడ్డాను. ఒక వంటకం కమ్మగా, రుచిగా ఎలా తయారవుతుంది? ఒక పని సొగసైన రూపు ఎలా దిద్దుకుంటుంది? ఒక కృతి రమణీయతను కళాత్మకతను ఎలా సంతరించుకుంటుంది?

షాపింగు కాంప్లెక్స్ చివరి కొసన, కానుగ చెట్టు దగ్గర, పారదర్శక పొగ తెరలు ఎప్పుడూ కమ్మి ఉండే ఇరుకు రెస్టారెంటు. సిమెంటు రేకుల చూరు వేలాడే కిర్రుమనే ఫాను కింద నుండి ఉసిళ్లపుట్టలా రోడ్డుదాకా ఎగబాగే కస్టమర్ల సందోహం. ఊదా రంగు పరదా వెనుక అక్షయపాత్రలోంచి తోడుకొస్తున్నట్టుగా సమస్త ఆర్డర్లను చకచకా మోసుకొచ్చి అందించే ఉంగరాల జుట్టు వెయిటర్ కుర్రవాడు. కౌంటర్ మీది నుండి గోవులా వంగి నమ్రతగా మాట్లాడే బొచ్చుటోపి ప్రొప్రైటర్. వరండాలో సగం పేవుమెంటు నాక్రమించిన భగభగమండే పొయ్యి గద్దె మీద సలసల నూనె కాగే నల్లని పెద్ద మూకుడు, బయటి గాలి సోకకుండా అడ్డుగోడగా నిలిపిన మసి బారిన ఇనుపరేకుల మాటున తన ప్రపంచం అదే నన్నట్టుగా సెగల్లో వేగుతూ, చెమటల్లో ఉడుకుతూ కూర్చుని, చిన్న టేప్ రికార్డర్ లోంచి బేగం అక్తర్ ఠుమ్రీ- *ఇస్ దర్జా బద్‌గుమాన్ హై... కులూసే బషర్ సే హమ్... అప్నోంకో దేఖ్‌తే హై... పరాయీ నజర్ సె హమ్...* -ని వింటూ, భావశూన్యంగా చూస్తూ, కడు నేర్పుగా సమోసాలు, బజ్జీలు చేసి నూనెలో వేయించి తీసే పేడి మూతి వంట మేస్త్రీ... ఆ రెస్టారెంటులో ఏదైనా మహిమ ఉంది అంటే, అది తనువూ, మనస్సు ఏకంచేసి పనిచేస్తే లక్ష్యం నెరవేరుతుంది అన్న సూత్రాన్ని అక్కడ ఆచరణలో పెట్టడమే కదా!

అదేదో పుస్తకంలోని- నీలి- నల్లరంగు ముఖపత్రం, పేరు గుర్తుకు రాదు- నూట అరవయ్యవ పేజీలో, 'ది ప్రాఫెట్ ఆన్ వర్క్' కింద, ఐదవ పేరాగ్రాఫులో మార్కింగ్ పెన్నుతో గీతలు పెట్టిన పంక్తులు; ప్రేమగా పని చేయడమంటే ఏమిటి? నీ ప్రియురాలు ధరిస్తుంది అన్నట్టుగా నీ హృదయంలోంచి లాగిన దారాలతో వస్త్రాన్ని నేయడం. నీ ప్రియురాలు అందులో నివసిస్తుంది అన్నట్టుగా అత్యంత అనురాగంతో ఒక ఇంటిని నిర్మించడం. నీ ప్రియురాలు ఆ ఫలాల్ని భుజిస్తుంది అన్నట్లుగా ఆప్యాయంగా విత్తి ఆనందంగా పంట కోయడం. నీవు రూపొందించే వస్తు సామస్త్యంలోకి నీ ఆత్మ ఊపిర్లూదడం. ఇంకా... దివంగత ఆత్మీయ గణం నీ ప్రక్కనే నిలబడి గమనిస్తూ ఉన్నారని నీవు తెలుసుకోవడం!

"ఓయ్! ఏదో ధ్యానంలో ఉన్నట్టున్నారు..." అంటూ మోచేత్తో నన్ను సున్నితంగా పొడిచింది శకుంతల. "మన అనూకి ప్రైజు రావాలని ప్రార్థించండి!"

తల ఊపి చిన్నగా నవ్వే ప్రయత్నం చేశాను. అభినయం, ఆహార్యం, వాచికం పాత్రలో లీనమైనప్పుడే నటన పండుతుంది కదా! ప్రైజు రావడం మాట ఎలా ఉన్నా అనుపమ కష్టపడుతుంది అనడంలో సందేహం లేదు. కష్టే ఫలి అని ఊరికే అనలేదు పెద్దలు. శోధించి సాధించడమే ధీరగుణం.

ఇంకో ప్రక్క లైట్లారిపోయినై. థియేటర్‌లో చీకట్లు ఆవరించాయి.

షిఫ్ట్ ఇంజనీర్‌గా నేను ఛార్జి తీసుకొన్న ఒకానొక నైట్‌షిఫ్ట్‌లో- గరిష్ట ఉత్పత్తి పారమితుల వెంట చక్కగా నడుస్తున్న ప్లాంట్ అకస్మాత్తుగా పవర్ షట్‌డౌన్ అయిన గందరగోళ పరిస్థితి. సాంకేతికలోపం మూలంగా ఎమర్జెన్సీ లైట్లు వెలగని గాఢాంధకారం. టర్బైన్లు, రియాక్టర్లు, బాయిలర్లపై స్వయం నియంత్రిత కంట్రోలు వాల్వుల, సేఫ్టీవాల్వుల గర్జనల హోరు. అందుబాటులో ఉన్న టార్చిలైట్లు పుచ్చుకొని ఆపరేటర్లు, ఛార్జిమెన్లు వివిధ ఫీల్డుల్లోకి పరుగు. మోగుతున్న ఫోన్లు ఎత్తుతూ ఫోర్‌మెన్‌లు గొంతు చించుకుంటున్న అరుపులు. ఉన్నట్టుండి కంట్రోల్‌రూమ్‌లో పెరిగిపోయిన అమ్మోనియా గాఢత. ముక్కులు, గొంతులు మండిపోయే కాలుష్యం. రిఫ్రిజిరేషన్ సెక్షన్‌లోని ఇరవై రెండు సేఫ్టీవాల్వుల్లో దేన్నని వెతకడం? వెతికేందుకు నాలుగు ప్లాటుఫారాలు ఆ చీకట్లో ఎవరెక్కగలుగుతారు? ఆలోచిస్తూంటే పరిస్థితులు విషమించే విపత్కర క్షణాలు. ప్లాంట్ స్టాఫ్‌ను సురక్షిత ప్రాంతాలకు పారిపొమ్మని ఆదేశాలివ్వాలనీ, ఫైర్ సర్వీసులను రెస్క్యూ కొరకు పిలవాలనీ నిర్ణయించుకొని చీఫ్ ఇంజనీర్‌తో మాట్లాడేందుకు ఫోన్ తీసుకొన్నాను.

-దయచేసి ఏ నిర్ణయమూ తీసుకోవద్దు. పావుగంట ఆగండి. ఎగ్జాక్ట్‌లీ ఫిఫ్టీన్ మినిట్స్, అని అరిచి సేఫ్టీరాక్ లోంచి ఆక్సిజన్ మాస్క్ తీసుకొని ఫీల్డులోకి పరుగెత్తాడు ఫోర్‌మెన్ అబ్బాసలీ.

అతను తీసుకున్న రిస్కుకి నాకు కోపం వచ్చింది. భయం కలిగింది. అందరి ముఖాల్లో ఉత్కంఠ. సరిగ్గా ఇరవై నిమిషాల తర్వాత, కంట్రోల్‌రూమ్‌లోకి తూలి, సోలి పడిపోయి, స్పానర్ టేబుల్ మీదికి విసిరేస్తూ వగరుస్తూ చెప్పాడు అబ్బాసలీ.

-లైను మీద ఫ్రాస్ట్ ఉన్నప్పుడే నేరస్థురాలైన సేఫ్టీ వాల్వు ఏదో తెలుస్తుంది కదా! అబ్జార్బర్ టవర్ మీది సేఫ్టీవాల్వు గాగ్ చేశాను!

"పిల్లలకి ఎవరు చేశారో మేకప్... భేషుగ్గా ఉంది! ఎంత చక్కగా డైలాగులు చెపుతున్నారు. వాహ్! అటు చూడండీ..." చిన్నపిల్లలా అరిచింది శకుంతల.

స్టేజి మీదికి చూశాను. నాటిక ప్రారంభమైంది. సెట్టింగూ బ్రహ్మాండంగా ఉంది. అడవి సీను- చెట్లు, పొదలు, చిన్న గద్దెలు. సింహాల జత, గుర్రం, మర్కటం, తాచుపాము, సూక్ష్మక్రిమి సమావేశమై ఉన్నాయి.

పాము: అతడు అసూయపరుడు- వినండి, తోటి వాళ్లను చూసి ఈర్ష్యాసూయలతో కుతకుత ఉడికి పోయాడు. అందుకే నాశనమయ్యాడు!

ఆడసింహం: అలాంటివాళ్లందరూ కట్టగట్టుకుని మరీ...

సింహం: నల్ల జాతీయులు, శ్వేత జాతీయులు, ఎర్రనివాళ్లు, పచ్చనివాళ్లు.

గుర్రం: వాళ్లు చాలాకాలం కిందటే ఎర్రవాళ్ని ఖతం చేశారు. అదో ఘోరమైన దురంతం. వీళ్ల నాశ నానికి అదే నాందీ ప్రస్తావన.

ఆడసింహం: శ్వేత జాతీయులు అందరికన్నా కర్కోటకులనుకుంటా!

కోరస్: ఔను. సరిగ్గా చెప్పారు.

పాము: వాళ్లు నల్ల జాతీయుల్ని పాదాక్రాంతుల్ని చేసుకున్నారు. పచ్చ జాతీయుల్ని రెచ్చగొట్టారు. అందుకే ఈ చిట్టచివరి యుద్ధం. ఆఖరి ప్రక్షాళన.

గుర్రం: కనీసం శ్వేత జాతీయులన్నా ఐకమత్యం గా ఉండాల్సింది. కానీ వాళ్లలా చేయలేదు.

పాము: వాళ్లు ఉండలేరు. మనుష్యులు నిజంగా ఐకమత్యంగా ఉండలేరు. వాళ్ల ఉద్దేశ్యంలో జీవితం అంటే స్వతఃసిద్ధంగా పోరాటమే. వాళ్లు వాళ్ల మానవత్వం విస్మరించారు. వాళ్లు కత్తిని నమ్ముకున్నారు. దానికే బలయ్యారు.

గుర్రం: ఒక్కో మనిషి తాను ఎవరని చెప్పుకుం టాడో మీకు తెలుసా? ఒకడు జర్మన్ అట, మరొకడు ఫ్రెంచివాడట, ఇంకొకడు ఇంగ్లీషువాడట, టర్క్ అట.

పాము: తగిలించుకున్న బిరుదులు.

"ఆహా... ఏమి నటిస్తున్నారయ్యా!" అప్రయ త్నంగా అనేశాను.

"ఎవరి గురించి మీరు మాట్లాడేది? అను పాత్ర రాలేదింకా..." అంది శకుంతల.

"ఆ హయగ్రీవుడూ, వాడి బాసూ..."

*

ఒక్క తోపుతో స్ప్రింగుడోర్లు తోసుకొని, చెమటలు కక్కుతూ తన ఆఫీసులో ప్రవేశించిన డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ వర్మ, హెల్మెట్ తీసి విసురుగా టేబుల్ మీద పెడుతూ సీట్లో కూలబడ్డాడు. చరచరా సర్వైకల్ కాలర్ బెల్టు విప్పి, మెడకాయను అటూ ఇటూ విసిరి, గుర్రం లాగా సకిలించి, గడగడా గ్లాసుడు మంచినీళ్లు తాగాడు. నాకు ముళ్ల మీద కూర్చున్నట్లుగా ఉంది. నా కళ్లల్లోకి సూటిగా చూస్తూ, "ప్లాంటులో పారామీటర్లు ఓకేనా?" అనడిగాడు.

అంతా సరిగా ఉన్నట్లు తలూపాను. కానీ మనసులో భయానుమానాలు పీకుతూనే ఉన్నాయి. మార్నింగుషిఫ్టు ఉద్యోగులు తమ లంచ్ క్యారేజీలు విప్పే సమయం అది. ఎన్ని జాగ్రత్తలు చెప్పి వచ్చినా, ఒకవేళ ఫోర్‌మెన్ ఏమరుపాటుగా ఉంటే, కంట్రోల్ రూమ్‌లో ఏదైనా చిన్న పొరపాటు జరిగితే ఉత్పత్తి పడి పోతుంది. షిఫ్టు ముగియడానికి ఇంకో గంట సమయ ముంది. ఇంకా లాగ్‌బుక్ రాయలేదు. ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాల్సి ఉందనీ, పది నిమిషాల కోసం అర్జంటుగా రమ్మనీ నన్ను పిలవడంలోని ఆంతర్యం ఏమిటో?

"చీఫ్ ఇంజనీర్ ఛాంబర్ నుండి వస్తున్నాను. నన్ను వేయించుకు తిన్నంత పనిచేశాడాయన. హి గ్రిల్డ్ మి ఫర్ హాఫ్ అన్ అవర్! ఇటీజ్ ఆల్ బికాజ్ ఆఫ్ యూ..." ఆఖరు పదం ఒత్తి పలికాడు.

క్షణంలో వంద ఆలోచనలు తిరిగాయి నా బుర్రలో. అసంకల్పితంగా కుర్చీలో ముందుకు వాలాను. "ఏ విషయం మీరు మాట్లాడేది?"

ఎయిర్ కండిషనర్ పనిచేయడం ఏనాడో ఆగిన ఆ ఆఫీసులో ఆయిల్, గ్రీజు, అమోనియా ప్రింటెడ్ డయాగ్రాముల తాలూకు అదోరకం వెగటైన లోహపు తుప్పు వాసన గుప్పుమంటోంది. పీడనం అధికమైన స్టీము కంప్రెసర్ హౌజ్ మీద గాల్లో కలుస్తూ పెద్దగా గర్జించింది. కూలింగ్ టవర్ నుండి ఉన్నట్టుండి వీచిన చల్లని గాలితెమ్మెర నీటితుంపరతో కూడిన నాచు కంపుని మోసుకొచ్చింది.

"చెబుతాను," అంటూ బెల్ మోగించి, ఆఫీసు స్టెనో ద్వారా ఎర్రపట్టీ చుట్టు 'కాన్ఫిడెన్షియల్' స్టిక్కర్ అంటించి ఉన్న ఒక ఫైలు తెప్పించాడు వర్మ. స్టెనో గ్రాఫర్‌ని వెళ్లిపొమ్మని సైగ చేశాడు. ఆఫీసు తలుపులు మూసుకొన్నాయి. "వచ్చే క్వార్టరులో జరగాల్సిన ప్రమో షన్ల అసెస్‌మెంటు గురించి నిన్న చీఫ్ ఇంజనీర్ ఆఫీసులో చర్చ వచ్చింది. పర్సనల్ మరియు ఇండస్ట్రి యల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంటుల నుంచి పాయింట్స్ తెప్పించి పరిశీలించాం. మన డిపార్టుమెంటులో ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు మొత్తం నాలుగు ఖాళీలున్నాయని తేలింది. రిజర్వ్‌డ్- సీనియర్- సీనియర్- మెరిట్... ఇదీ

వరుసక్రమం. మొదటి మూడు ఎవరికి చెందాలో సులభగ్రాహ్యంగానే ఉంది. కానీ నాలుగోది 'జెడ్'- మెరిట్ పోస్టుతోనే వచ్చింది చిక్కంతా.''

''అందరు ఫోర్‌మెన్‌ల కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు ఇంకా అన్ని ప్లాంటుల నుండి అందలేదా?''

''అందాయి. కాబట్టే ఈ తర్జనభర్జనంతా...'' అంటూ ఫైల్లోంచి ఒక షీటు తీశాడు వర్మ. అది ఎత్తిపట్టి అన్నాడు. ''ఇది మన ప్లాంటు నుండి, నువ్వు రాసిన నీ క్రింది 'సి' గ్రూపు ఉద్యోగుల కాన్ఫిడెన్షియల్ రిపోర్టుల్లోనిది. ప్రమోషన్‌కి అర్హులైన వాళ్లల్లో- ఇదిగో, ఈ వ్యక్తి మెరిటోరియస్ అవుతున్నాడు.''

ఆ షీటు తీసుకొని ఉద్యోగి పేరు చూశాను. ఆమూలాగ్రం చూపులు పోనిచ్చాను. సమయపాలన, విధేయత, విషయ పరిజ్ఞానం, విశ్లేషణాపటిమ, రిస్కు తీసుకొనే చొరవ, నాయకత్వ లక్షణాలు... వగైరా అంశాల్లో ఆ వ్యక్తి మామూలు 'సంతృప్తికరం' కన్నా మరింత ఉన్నతమైన రిమార్కులు పొంది, వెరసి 'చాలా మెరుగైన' అభ్యర్థి అనిపించుకున్నాడు. ''హి డిజర్వ్స్ ఇట్. నిజంగా ఇతను ప్రమోషన్‌కు తగినవాడు...'' అని స్థిరంగా పలికాను.

డిప్యూటీ చీఫ్ వర్మ ముఖం కందగడ్డలా ఎర్రబడింది. ''అనూచానంగా అనుసరిస్తున్న అధికారికంగా నిర్వచించుకుంటున్న, పై కొలప్రమాణాల్ని మాత్రమే పరిగణనలోకి తీసుకొని ఒక కీలకమైన పదవిలోకి పదోన్నతి పొందడానికి ఒక అభ్యర్థి అర్హతను నిర్ణయించజాలం...'' అంటూ లేచి నిలబడ్డాడాయన. ''చూడు మిస్టర్ మౌళీ! మనం సేఫ్టీలో, ఉత్పాదనా ప్రమాణాల్లో, పరిసరాల పరిశుభ్రతలో ఇదిగో... ఎన్నో రొటేటింగ్ షీల్డులు సాధించాం. ఈ ఒరవడి ఇలాగే కొనసాగాలంటే మన కిందివాళ్లూ, సహచరులూ 'నమ్మకస్తు'లయి ఉండాలి. మనది దేశంలో అతి పెద్ద రసాయనిక కర్మాగారం. మనవి అత్యంత కీలకమైన ఉత్పత్తులు. అందుకే నేనడిగేదొక్కటే- క్రికెట్ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు గెలిస్తే ఆనందంతో కేరింతలు కొట్టి మిఠాయిలు పంచుకొనే 'వాళ్ల'ను కీలక స్థానాల్లో కూర్చుండబెట్టి మనం నిశ్చింతగా కునుకు తీయగలమా?''

నాకు అర్థమయీ అర్థం కాకుండాపోయింది. ''మనది సెక్యులర్ రాజ్యం సార్! అలా ఆలోచించడం పొరపాటు,'' అన్నాను తల ఎత్తి.

రివాల్వింగ్ ఛైర్ విసురుగా తిప్పాడు, డిప్యూటీ. ''సెక్యులర్ స్టేట్! నేను కాదన్నానా? నా ఉద్దేశం- నాదే కాదు, నిన్న మీటింగులో పాల్గొన్న ఉన్నతాధికారుల ఉద్దేశం కూడా- సూటిగా, సరళంగా చెపుతున్నా విను. పై పదవుల్లో ప్రమోషన్లు ఇచ్చేటప్పుడు, అనధికారికంగా, దేశభక్తి అనే అంశాన్ని కూడా గుర్తించాలి.''

''అది అసంబద్ధం. అనుచితం, హేతువిరుద్ధం కూడా.''

గొంతు పెంచాడు డిప్యూటీ. ''మౌళీ! నీదంతా ఉటోపియన్ ఆలోచన. ప్రాక్టికల్‌గా ఆలోచించడం నేర్చుకో. దేశంలో ఉగ్రవాదుల ఘాతుకాలు పెచ్చరిల్లిపోతున్న దృష్ట్యా పలు శాఖల్లో, రంగాల్లో ఈ విధానం చాపకింది నీరులాగా అమలవుతున్నది. ఇది నిజం. అమెరికా, యూరోపియన్ దేశాల్లో సైతం వాళ్లను ప్రొఫైలింగ్ చేస్తున్నారు. ఉద్యోగ నియామకాల్లో, విమానయానాల్లో భద్రత కోణంలోంచి అనుమానంగా చూస్తున్నారు. అండర్‌స్టాండ్!''

ఫాను స్పీడు పెరిగి, రూమ్‌లో ఉష్ణోగ్రత పడిపోయి నాకు చాలా నీరసంగా అనిపించింది. నా వంట్లోని సత్తువ అకస్మాత్తుగా వేడి ఆవిర్ల రూపంలో చెవుల్లోంచీ కళ్లల్లోంచీ బహిర్గతమైపోతున్నట్టుగా తోచింది. ఆకలితో కడుపులో ప్రేవులు గుర్రుమన్నాయి. ''ఓ.కే. ఇప్పుడు నేను ఏమి చెయ్యాలి సార్?''

''దట్స్ గుడ్,'' అంటూ డిప్యూటీ అదే ఫైల్‌లోంచి మరో షీటు, రెండు గులాబిరంగు కవర్లు తీశాడు. షీటు టేబుల్ మీద నా ముందుకు తోశాడు. ''అదిగో... ఆ అభ్యర్థి జెడ్ స్థానంలో వచ్చేటట్టుగా సిఆర్‌లు తిరగ రాయాలి. వెరీ సింపుల్.''

షీటు మీద పేరు చూడగానే నా ఒంటి మీద తేళ్లు, జెర్రులు పాకినట్టనిపించింది. ''ఇతనా? ఎ రెక్‌లెస్ ఫెలో,'' అన్నాను చిరెత్తుకొచ్చి.

''టెంపుల్ కమిటీ మెంబర్. వెల్ఫేర్ కౌన్సిల్‌లో సభ్యుడు. మంచి వాగ్ధాటి గలవాడు. రేపేదన్నా యూనియన్‌తో తగాదా తలెత్తితే నూరుమందిని నిలువరించ గల సత్తా ఉన్న వాడు. పైగా పై అధికారికొకరికి దగ్గరి బంధువు కూడానట! ఇంకేమి అర్హత కావాలయ్యా?'' అనేసి గొంతు తగ్గించాడు వర్మ. ''మనదేంపోయింది- వాళ్లు తానా అంటే మనం తందానా అందాం.''

నేనక్కడ ఇక ఎక్కువసేపు కూర్చోలేననిపించింది. ''అలాగే రేపు చూద్దాం,'' అని లేచి నిలబడ్డాను.

''ఓ.కే. యు కెన్ టేక్ ఎ డే ఆర్ టు. బట్...'' నా కళ్లల్లోకి గుచ్చుకొనేలా చూస్తూ అన్నాడు వర్మ. ''నువ్వోసారి చీఫ్ ఇంజనీర్‌ని కలవాల్సి ఉంది.''

*

నాటిక రసవత్తరంగా సాగుతోంది. ప్రేక్షకులు ఉత్సుకతతో చూస్తున్నారనడానికి నిదర్శనంగా థియేటర్‌లో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. అయితే స్కూలు

పిల్లల చప్పట్లతో కూడిన అభినందనలు మధ్యమధ్య దాన్ని భగ్నం చేస్తున్నాయి.

పాము: కోర్టు విధించిన శిక్షను ఎవరు అమలు చేస్తారు?

ఆడసింహం: సూక్ష్మక్రిమీ! నువ్వా పని చేసెయ్.

సూక్ష్మక్రిమి: చంపి, చంపి నాకు విసుగు పుట్టింది. వేరే ఎవరన్నా...

సింహం: నేను చేస్తా ఆ పని. ఒకే ఒక పంజాదెబ్బ.

ఆడసింహం: మరీ క్రూరంగా వ్యవహరించకు ప్రియతమా...

నాకు అనీజీగా అనిపించింది. చూపులు స్టేజీ మీది నుంచి మళ్లించాను. అకస్మాత్తుగా నా దృష్టి ముందర పల్లంలోని విశిష్ట అతిథుల ఎన్‌క్లోజర్‌పై పడింది. మొదట ఖాళీగా కనిపించిన ముందు వరుస లోని రెండు సీట్లలో చీఫ్ ఇంజనీర్ దంపతులు.

గభాల్న లేచి దాదాపు నిలబడ్డాను. "వాళ్లు ఎప్పు డొచ్చి కూర్చున్నారు?"

నేను వేలెత్తి చూపించిన వైపు చూసి కన్నడు చెప్పాడు. "వాళ్లా... ఆ బట్టతల అంకుల్, హెన్నావర్ణపు కొప్పు ఆంటీ అప్పుడే, డ్రామా స్టార్ట్ అవకముందే ఈ దోవనే వెళ్లారు నాన్నా!"

షాపింగ్ సెంటర్‌లో రెస్టారెంటు దగ్గర నుండి నన్ను నక్షత్రకునిలా వెంటాడుతూ వస్తున్నాడు చీఫ్ ఇంజనీర్ భార్గవ. అతని కంటపడకుండా ఉండేందుకు చీకటిసందుల్లో, చెట్లకొమ్మల నీడల మాటున దాక్కుంటూ దాదాపు పరుగులాంటి నడకతో థియేటర్ కొచ్చాను. అంతా వృథా ప్రయాస. అతను నన్ను చూసే ఉంటాడు. నా రక్తనాళాల్లో ఎర్రకణాలకు బదులు ఉడుకుతున్న ఇనుపరజను ఝామ్మంటూ ప్రవహిస్తున్న నిశ్శబ్దహోరు నా కణతల దగ్గర తాకింది.

"మెడికల్ లీవు పెట్టానన్నారు. కాస్త స్థిమితంగా కూర్చోలేరూ?" విసుక్కుంది శకుంతల.

*

చీఫ్ ఇంజనీర్ ఆఫీసు. మధ్యాహ్నం నాలు గ్గంటల సమయం. ఎయిర్ కండిషనర్ జోరుగా నడుస్తూ నాకు అసౌకర్యంగా తోచింది. టేబుల్ ఆ చివర ఇండస్ట్రియల్ ఇంజనీర్ కాశ్యప్. ఈ చివర పర్సనల్ మేనేజర్ వామనరావు, ఎదురుగా నేనూ కూర్చుని ఉన్నాము. బంట్రోతు లోపలికొచ్చి అందరి ముందు టీ కప్పులు, బిస్కెట్లు పెట్టాడు.

టీ చప్పరిస్తూ నా ముఖంలోకి చూశాడు భార్గవ. "వాటీజ్ యువర్ ప్రాబ్లెం మౌళీ? రెండ్రోజులు సెలవు అడిగావు. అప్లికేషన్ ఇందాకే చూశాను..."

నేను కారణం చెప్పాను. సగం టీ వదిలేశాను.

"ఓ... ఐసీ..." సాలోచనగా చూశాడు భార్గవ. "గ్రాంటెడ్," అన్నాడు.

మోచేతులు తీసేసి టేబుల్ మీది ఫైలు బహి ర్గతం చేస్తూ కాశ్యప్ అన్నాడు, "పొల్యూషన్ కంట్రోల్ సెల్ ఇన్‌ఛార్జిగా మీరు డిప్యుటేషన్ మీద ఉన్నప్పుడు ఇచ్చిన సలహాలు, సూచనలు, కేస్‌స్టడీస్ అన్నీ ఇందులో ఉన్నాయి కదూ చూడండి మిస్టర్ మౌళీ!"

ఫైలు అందుకొని చూశాను. 'కాలుష్య నియంత్రణ యోజన- కేసు స్టడీ- 2005' పేజీలు తిప్పాను. నలభై రెండు గొర్రెలు. పత్రికల్లో ఫోటో- ప్రచు రితమైన వాటి మృతదేహాలు. 'పరిశ్రమ యాజమాన్యం కాలుష్యపూరిత వ్యర్థజలాల్ని బాధ్యతారహితంగా పొరుగునున్న గ్రామ చెరువులోకి వదిలిన కారణంగా జరిగిన ప్రమాదం' అన్న వార్తల కటింగ్సు, ప్రభుత్వ కాలుష్య నివారణ బోర్డు వారి తాఖీదులు, డైక్రోమేటు పాయిజనింగ్ అని అంతిమంగా బోర్డు వారి తీర్పు, ఎంక్వైరీ, సంజాయిషీ, నష్టపరిహారాల వివరాలు, పరిశ్రమ తీసుకోవాల్సిన చర్యల అనుబంధ జాబితా...

నా మనసులో శంకలు, సంకోచాలు. "ఇపుడీ కేసు ప్రస్తావన ఎందుకు సార్?"

"సెంట్రల్ ఆఫీసు వారు ఈ కేసు వివరాలు కావాలని అడిగారు. సంక్షిప్తీకరించి, బులెటిన్‌గా ముద్రించి అంతర్గతంగా అన్ని యూనిట్లకీ సర్క్యులేట్ చేస్తారు," అన్నాడు కాశ్యప్.

"అయితే ఈ ఫైలు యథాతథంగా పంపాలా లేక వడగట్టి మీ సలహా, సూచనల భాగం మాత్రమే పంపించాలా అన్నది ఇంకా నిర్ణయించలేదు!" ఎన్నో అర్థాలు స్ఫురించేలా ముసిముసిగా నవ్వుతూ అన్నాడు భార్గవ.

అది నాకు మేలు చేసే చర్యా, లేక నా కెరీర్‌ను దెబ్బతీసే పన్నాగమా, లేక నన్ను ఇరుకున పడేసే కుట్రా? రెండువైపులా పదునున్న కత్తి అది. అసలు ఆ ఫైలు దుమ్ము దులపాల్సిన అవసరం నిజంగా ఉన్నదా అన్నది నాకు అవగతంకాలేదు. నా వెన్ను జలదరించింది. ఎటూ తేల్చుకోలేక కిటికీవేపు తల తిప్పాను. అరఫర్లాంగు దూరంలో, రోడ్డు అవతలి సెంట్రల్ వర్క్‌షాప్‌లో కళ్లు మిరుమిట్లు గొలిపేలా నిప్పురవ్వలు చిమ్ముతూ, ధన్‌ధనామంటూ యాన్విల్ మీద సుత్తి మోదుతూ, కొనసాగుతున్న వెల్డింగ్, గ్రైండింగ్, ఫోర్జింగ్ పనులు గ్రిల్ గేటు గుండా కనిపి స్తున్నాయి. నా బుర్ర కొలిమిలా వేడెక్కింది.

"ప్రస్తుతానికి ఆ ఫైలు మూసెయ్యండి. తర్వాత ఆలోచిద్దాం కాశ్యప్‌గారూ..." అంటూ టాపిక్ మళ్లిం చాడు భార్గవ. టేబుల్ సొరుగులోంచి ఒక పుస్తకం తీసి అందరికీ చూపెడుతూ వామనరావుతో అన్నాడు, "డ్యూటీ మీద ఉన్న ఉద్యోగి ఇలా పుస్తకం చదువు తూనో, చదరంగం ముందేసుకునో పట్టుబడితే మేనేజి మెంటు ఏమి చెయ్యవచ్చో చెప్పండి రావుగారూ..."

"స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం అది 'నెగ్లిజెన్స్ ఆఫ్ డ్యూటీ' కిందికి వస్తుంది. మెమో ఇష్యూ చెయ్యడమో, మౌఖికంగా హెచ్చరిక చేయడమో ఏదో ఒక చర్య ఆ ఉద్యోగిపై తీసుకోవచ్చు మీరు..." అన్నాడు వామన రావు.

నావైపు చూశాడు భార్గవ. "చాలా కాకతాళీయం. నిన్న సాయంకాలం ఆర్గాన్ ఫిల్లింగ్ సెక్షనులో మెయిం టెన్సు పనులు తనిఖీ చేసి కోల్డ్‌బాక్స్ మీదుగా వస్తున్న ప్పుడు టర్బైన్ దగ్గర ఫోర్‌మెన్ డెస్కు మీద కనిపించింది ఇది. అప్పుడు అక్కడ డ్యూటీ మీద వున్నది ఎవరో తెలుసా? మీ కితాబు మూలంగా 'జెడ్' పోస్టుకు అర్హు డవుతున్న అభ్యర్థి..."

అది పెద్ద నేరమేమీ కాదని నాకు తెలుసు. పుస్తకం విప్పి చూశాను. అదో ఫిలాసఫీ పుస్తకం. మంచి పొయిట్రీ కూడా ఉంది. అక్కడక్కడా కొన్ని పేజీల్లో ఉల్లేఖించిన వాక్యాల్ని చదవకుండా ఉండలేక పోయాను. నా అభిప్రాయం చీఫ్‌కి వివరించ నిశ్చ యించుకున్నాను. కానీ ఆయన నా ఉద్దేశ్యం పసి గట్టాడు.

"చూడు మౌళీ! ఏదైనా టెక్నికల్ బుక్, లేక 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' గ్రంథమో చదువుకుంటుంటే చూసీచూడనట్టు పోవచ్చు. కానీ ఇది- ఎవడో లెబనీస్ ఫిలాసఫర్ రాసింది. అందులో ఏ ఫండమెంటలిస్టు సిద్ధాంతాలున్నాయో మనకేమి తెలుసు? సో వియ్ మస్ట్ బి వెరీ కేర్‌ఫుల్... ఏ చర్య తీసుకుంటావో నీ విజ్ఞతకే వదిలేస్తున్నా. వర్మగారితో మాట్లాడు. ఓ.కే. యు కెన్ గో," అనేశాడు చీఫ్.

*

శకుంతల నాటిక చూడడంలో లీనమైపోయి పకపక నవ్వింది. నేను మంచినీళ్ల బాటిల్ కొరకు చేయి సాచాను. కన్నడు సమోసాల ప్యాకెట్ అందించ బోయాడు. నేను వద్దన్నాను. విపరీతమైన ఆకలి. నిస్త్రాణ. కానీ తినాలంటే భయం. భయాన్ని మించిన బెంగ. అంతకన్నా ఏదో అసంతృప్తి, అశాంతి మూలంగా గుండెలో గూడు కట్టుకుంటున్న దిగులు. నేనేమీ చెయ్యలేనా? అంత పిరికివాడినా? రెండు గుక్కల నీళ్లు తాగి స్టేజి మీదికి దృష్టి పెట్టాను. నాటిక అర్థమవు తోంది. భూమండలం మీద మనిషి ఉనికి లేకుండా పోయినందుకు జంతుజాలం మహదానందంగా వుంది. ఎక్కడో మారుమూల నుండి మనిషి వాసన వస్తున్నదని శునకం చెప్పడంతో వాటిల్లో ఉలికిపాటు. అవశేషాన్ని నిశ్శేషం చెయ్యడానికి సింహం ఉద్యుక్తమైంది. ముందుగా నిర్ధారించుకు రమ్మని కోతిని పంపింది. తాను చూసేంతవరకూ ఏ చర్యా తీసుకోవద్దని ఏంజెల్ చెప్పింది.

మర్కటం: అడుగో... అతడు ఇటే వస్తున్నాడు! వేసెయ్యండి...

అందరికన్నా చలాకీగా, హుషారుగా నటిస్తు న్నాడు మర్కట పాత్రధారి. ఆ పాత్ర అలాంటిది మరి. ఒకసారి నాలుగు కాళ్ల మీద మరోసారి రెండు కాళ్ల మీద నడవాలి, గెంతాలి. ఆటా, పాటా, అక్రోబాటిక్స్. ఎంత ఉల్లాసభరితం ఆ రోజులు! బాధ్యతలు, బరువులు లేని ఆ దశ... నా చిన్నతనంలో, నిక్కర్లు వేసుకొనే వయసులో వాడు... వాడు సలీంగాడు ఇట్లాగే దుమికేవాడు. వాడిప్పుడు ఎక్కడున్నాడో? నా జ్ఞాపకాల పొరల్లోంచి ఒక బ్లాక్ అండ్ వైట్ పుట బూజు దులుపు కుంది.

*

మూతి బిగించి, పుస్తకాలు ఒడిసి పట్టుకొని, ఒక అంగ వెనక్కి తీసుకొని, బాల హనుమాన్‌లాగా లాఘ వంగా ముందుకు దుమికాడు సలీం. ఆరడుగుల వెడల్పున్న కాలువ ఒడ్డున సురక్షితంగా కాలుమోపాడు. అంతకుముందు అదే ప్రయత్నంలో విఫలమై ఆవలి ఒడ్డున దుస్తుల కంటిన బురద, ఇసుక తుడుచు కుంటున్న స్నేహితులు మెచ్చుకోలుగా నవ్వి, 'గుడ్' అన్నారు. నాకు రోషం పొడుచుకు వచ్చింది. అదెంతపని అన్నట్లుగా అందరి వైపోసారి చూసి, రెండడుగుల ఊపు తీసుకొని బలమంతా కూడదీసుకొని లంఘించాను. బురద అంచు నీళ్లలో ఠపీమని దిగబడి ముందుకు తూలి పడబోయి బ్యాలన్సు కోసం సలీం భుజాల్ని పట్టు కొన్నాను. ఇద్దరమూ తడి ఇసుకలో పడిపోగా అందరూ పకపక నవ్వారు.

"వాహ్. ఇంకోసారి ప్రయత్నిస్తే దుముకగలవురా మౌళీ!" అన్నాడు సలీం, తడిసిన పుస్తకం పేజీలు తిప్పుతూ.

"ఈ సర్కస్ ఫీట్లు మనకొద్దు. కాళ్లేతులు విరగ్గొ ట్టుకుంటే ఇంట్లో తంతారు. పదండి..." అన్నాడు రమేష్.

"వీడు చదువులోనూ ఫస్టు. ఆటల్లోనూ ఫస్టు. ఇంత బలమెక్కడిదిరా నీకు?" అంటూ శివానంద్ సలీం

గాడి వీపు మీద నవ్వుతాలుగా గుద్దాడు. సలీం నవ్వుతూ, గుద్దులు తప్పించుకునేందుకు చకచకా అంగలు వేస్తూ అందరికన్నా ముందు వొర్రెగట్టు ఎక్కేశాడు.

"వీడి ఇంట్లో ఎద్దుమాంసం తింటారు. అందుకే వీడి కాళ్లల్లో మస్తు పూలుగున్నది! మనకేమో దాన్ని చూస్తేనే వాక్..." అన్నాను మిత్రుల్ని అనుసరిస్తూ. పొద్దు నడికెత్తికెక్కుతూ, మార్చి నెల రెండోవారం ఎండ వీపు చిరచిరలాడిస్తోంది.

సలీం టక్కున ఆగి, కిందపడ్డ వస్తువునోదాన్ని గుప్పిట్లో మూసి పుస్తకం పేజీల్లో పెట్టేశాడు. స్నేహితు లందరమూ కుతూహలంగా చూశాము. "ఏమిట్రా అది?" అనడిగాడు రమేష్.

"ఏమీ లేదు," అని దాటవేసే ప్రయత్నం చేశాడు సలీం.

"మాకు చూపెట్టవా బే..." అంటూ కోపంగా శివానంద్ వాడి చేతిలోని పుస్తకం లాక్కొనేందుకు పెనుగులాడాడు. సలీం ఆగమని సైగ చేసి, తానే పాఠ్య పుస్తకం పేజీలు తెరచి, ఎండి రెక్కలూడుతున్న ఓ గులాబీ పువ్వును అందరికీ చూపి మళ్లా పేజీల్లో పెట్టేశాడు.

"ఆడపిల్లలాగా పూలు పుస్తకంలో పెట్టుకుంటావురా?" ఎగతాళిగా అన్నాను.

"ఈ పుస్తకం నాది కాదు. నీరజది."

"ఆమె పుస్తకం నీ దగ్గర ఉండటమేమిటిరా?"

"మొన్న ఇంగ్లీషు టీచర్ క్వచ్చనాన్సర్లకు టిక్కులు పెట్టించినప్పుడు తానా రోజు ఆబ్సెంటట. నన్ను టిక్కులు పెట్టియ్యమని అడిగింది."

"బడాయిలు కొట్టకురా... ఏదీ చూడనీ," అని నేను పుస్తకం గుంజుకొని అట్ట తెరిచాను. ఎనిమిదో క్లాసు ఇంగ్లీషు పాఠ్య పుస్తకం. 'డి. నీరజ- గవర్నమెంటు హైస్కూలు,' అన్న చేతిరాత కనపడింది. మా ముఖాల్లో ఆశ్చర్యం. నాకైతే సలీంగాడంటే ఆ క్షణం నుంచి ఈర్ష్య పుట్టింది.

"బడే చుపారుస్తుమ్ ఉన్నావు రా బే..." అంటూ శివానంద్ గులాబీపువ్వును స్పృశించే ఉద్దేశంతో ముందుకు వంగాడు.

'చల్ బె చల్. ముట్టకు దాన్ని. అది నేనిచ్చిన గులాబీ!" అంటూ సలీం ఎర్రబడ్డ ముఖంతో శివానంద్‌ని అదరగొట్టి, పుస్తకం చేజిక్కించుకొని ముందుకు పరుగు తీశాడు. వాడి నోట్లోంచి సన్నగా ఈలపాట- రూప్ తెరా మస్తానా... ప్యార్ మెరా దివానా...

నలుగురు మిత్రులం అలవాటుగా దిరిసెన చెట్టెక్కి తలో మండమీద కూర్చున్నాం. రిక్రియేషన్ క్లబ్బు నుండి దొరల బంగళాకి వెళ్లే తారురోడ్డు కిరువైపులా దిరిసెన, కానుగ వృక్షాలు, పచ్చని వైల్డ్‌ఫైర్, గుల్‌మొహర్ చెట్ల ఉసలు. ఫర్లాంగు దూరంలో కూడలి- పవర్‌హౌజ్‌కు వెళ్లేందుకు ఒకటి, రైల్వేస్టేషన్ కెళ్లేందుకు మరోటి రోడ్లు చీలాయి. పావుగంటకూ, అరగంటకూ ఒకసారి బొగ్గు లారీలు, క్రషర్ ట్రక్కులు, బస్సులు పరుగెడుతున్నాయి. దొరల బంగళావైపు స్కూటర్ మీద వెళుతున్న ఓవర్‌సీరొకాయన మమ్మల్ని చూసి ఆగాడు. "ఏమిర పోరగాండ్లూ! మొన్నగూడ కనపడ్డరు. కోతుల్లెక్క చెట్లెక్కి ఏం జేస్తున్నర్రా? ఆ..." గద్దించాడు.

"పరీక్షలు దగ్గరపడ్డాయి. చదువుకుంటున్నాం సార్!" అని పుస్తకాలు చూపెట్టాను. "మా వాడలో ఇండ్లల్ల గర్మీ. ఊపిరాడని పొగ, లొల్లి."

"సరే," అని స్కూటర్ పోనిచ్చాడు ఆఫీసర్. "కొమ్మలిరగ్గొట్టకుండ్రి. భద్రం."

చెట్టుకొమ్మలు సన్నగా ఊగనారంభించాయి. చల్లటిగాలి వీచింది. లావాటి కొమ్మల మీద ఒరిగి సౌకర్యంగా కూర్చున్నాం. అరగంట చదువయాక ఆవులింతలొచ్చాయి నాకు. శివానంద్ కునుకుతూ పుస్తకం కిందికి జారవిడిచాడు. నిద్రమబ్బు వదిలించుకునేందుకు ఏదన్నా ఆటాడుకుందామని సలీం ప్రస్తావించాడు. కోతి కొమ్మచ్చి ఆటకు ఏకగ్రీవ తీర్మానమైంది.

'తెల్లగున్నోడు దొర, నల్లగున్నోడు దొంగ,' అంటూ చప్పట్లు వేసుకొన్నాం. సలీంది తెల్లనిదీ, మా ముగ్గురివి నల్లనివీ చప్పట్లు వచ్చాయి. "మనది మెజారిటీ. టాస్ ఓడినోడూ, దొంగా వాడే," అని సలీం వైపు తీర్మానం చేశాను. మూరెడు పొడవున్న ఎండుపుల్ల ఒకటి వెతికి తెచ్చి చెట్టు కాండం దగ్గర గుండం గీశాను. కుడికాలు లేపి మోకాలు కింది నుండి పుల్లను బలంగా అవతలికి విసిరాను. అది దూరంగా తంగేడు పొదల్లో కంకరకుప్ప ఆవల పడింది. సలీం పుల్ల కోసం పరుగు లంకించుకున్నాడు. ముగ్గురు మెజార్టీ మిత్రులం గబగబ చెట్టెక్కేశాం.

ఒక్క దౌడుతో కంకరకుప్ప మీదుగా గెంతి, పుల్ల అందుకొని వెనుదిరిగి క్షణాల్లో చెట్టు కిందికి చేరుకున్నాడు సలీం. కొమ్మలవైపు తలెత్తి, చింపాంజీలా అభినయించి చకచకా కాండం మీదకు పాకాడు. తల అటూ ఇటూ తిప్పి సన్నపు కొమ్మమీదికి ఎగబడ్డాడు. రమేష్‌గాడు ఇంకా పైకి, చిటారుకొమ్మల్లోకి పాకాడు. వాడు దొరికిపోవడం ఖాయమని గ్రహించి, అలా జరగకుండా ఉండేందుకు ఏమి చెయ్యాలో క్షణం ఆలోచించాను. సాహసించి ఏడడుగుల ఎత్తు నుండి దూకి, గుండంలోని పుల్లను మరింత బలంగా ఇంకోవైపు

విసిరేసి, ''సలీంగాడు మళ్లా ఔట్,'' అని అరిచాను. 'ఛట్' అని తుపుక్కున ఉమ్మేసి, గబుక్కున చెట్టు దూకి పరిగెత్తాడు సలీం. వాడో నిమిషం పాటు అగమ్యంగా తిరిగి, రిక్రియేషన్ క్లబ్బు వెనకాలి చెత్తా చెదారాల కుప్పల్లో, చిట్టిరేగు, జిల్లేడు పొదల మధ్య వెతుకులాట సాగించాడు. రెండు నిమిషాల తర్వాత, 'యా అల్లా,' అన్న బాధాకరమైన అరుపు మా చెవిన పడింది. ఒకరి ముఖం మరొకరు చూసుకొన్నాం. భయంతో మా గుండెలు దడదడలాడాయి. సలీం కోసం పరిగెత్తాం.

''యాహ్ అల్లా. మై మర్‌గయా అమ్మీ... అబ్బా...'' అంటూ మూలిగి ఎడంకాలి మడమవేపు చేతులు పోనిచ్చాడు సలీం. నాలుగంగుళాల పొడవున్న గోళీసోడా సీసం పెంకు అరిగిన స్లిప్పర్‌లోంచి పొడు చుకుపోయి మడమలో అంగుళం లోతు గుచ్చుకొ నుంది. వాడు కళ్లు మూసుకొని పెంకును పెరికి వేసు కున్నాడు. జలజలా నెత్తుటిధార గడ్డిని తడిపేసింది. నా కాళ్లు వణికాయి.

''అరేయ్... ఎవరికీ చెప్పొద్దు. ఇక్కడ్నించి పారి పోదాం పద...'' అన్నాను. ఇద్దరు మిత్రులు ఉలకలేదు, పలకలేదు. ''వీడి ఇంట్లో గొడ్లను కోసే కత్తి ఉంది. వీడి అబ్బా మనల్ని హలాల్ చేస్తాడు. నేను ఇంటికి పోతా. మీ ఇష్టం,'' అని మిత్రుల ముఖాల్లోకి చూశాను. వాళ్లు సంశయించారు. నేను పరుగున రోడ్డెక్కాను.

*

''ఏమయిందండీ? సొడలు సొడలు పోతున్నారు. చాలా నీరసంగా ఉందా? అడిగింది శకుంతల.

తలూపాను. నా శరీరభాగాల్లోని రక్తమంతా గుండెలోకి చేరుకొని బరువుగా కిందికి లాగుతున్నట్టని పించింది. శారీరక బాధకు పెయిన్ కిల్లర్స్‌తో ఉప శమనం. కానీ మనసు పొరల్లో స్రవిస్తూ సలుపుతున్న వ్రణానికి ఏ లేపనం పూయాలి? ఏ మందు వెతకాలి?

''ఇదిగో, ఈ సమోసా తిని నీళ్లు తాగండి,'' అంది శకుంతల.

''మన పిల్ల ప్రోగ్రాం చూద్దామనిగానీ- లేకపోతే మిమ్మల్ని ఇంటిపట్టున రెస్టు తీసుకొనిచ్చేదాన్నే. నాటిక అయిపోవస్తున్నది. తరువాత బహుమతి ప్రదానాలు. చివరి ఆర్కెస్ట్రా ప్రోగ్రాం వరకు ఉండాలా వద్దా అన్నది మీ ఇష్టం. ఒక్క పావుగంట ఓపికగా కూర్చోండి. ప్లీజ్. ఎంత చక్కగా నటిస్తోంది అనుపమ! చూడండి.''

పైన మబ్బుల్లేని ఆకాశం బోర్లించిన బ్రహ్మాండ మైన వేడిమూకుడులా ఉంది. గాలి ఆడడంలేదు. చొక్కా గుండీలు రెండు విప్పి స్టేజి మీదకు చూశాను. చేతిలోని సమోసా ఆకలిని రెట్టింపు చేసింది.

పాము: చంపెయ్యండి వాణ్ణి.

ఏంజెల్: మిత్రులారా! అతను ఇప్పుడు ఒంటరి జీవి.

ఆడసింహం: ఔను (అందరివైపు చూసి) కాబట్టి ఎంతో కాలం బతకడు.

సింహం: ప్రభూ! ఇంత ఘోరకలి తర్వాతా వాడు బతకడానికి అర్హుడు అని మీరు నిజంగా భావిస్తు న్నారా?

ఏంజెల్: మీ ప్రాపంచిక దృష్టితో చూస్తే మాత్రం అర్హుడు కాడు. కానీ, మిత్రులారా! ద్వేషంతో ఏకపక్ష కోణంలోంచి ఆలోచించకండి. భూమండలాన్ని మించిన గోళాలు, గ్రహాలూ ఈ విశ్వంలో ఎన్నో వున్నాయి. మీకు అతీతమైన సూత్రాలు, నియమాలు ఇంకా ఉన్నాయి. కృంగి, కృశించిన ఈ ఒంటరి మానవుడు మిమ్మల్ని మళ్లా బాధించబోడు. ఈ క్షతగాత్ర సైనికుడు వాళ్ల జాతిలో మిగిలిన ఆఖరు అవశేషం. తప్పుడు శిక్షణ ఫలితంగా వీడు చెడిపోయిన బాలకుడు. దేవుని రాజ్యంలో వీడిపై కరుణ కురుస్తుంది. వీడిని నాకు ఒదిలెయ్యండి, నేను చూసుకుంటా.

సైనికుడు: క్షమించండి స్వామీ, నాకోసం శ్రమ తీసుకోవద్దు. నేను పోరాడి, పోట్లాడి, చంపి అలిసి పోయాను. ఈ ప్రపంచంలో నాకెవ్వరూ లేరు. నాలో ఏ కోరికా లేదు. మృగరాజా! ఒక్క పంజాదెబ్బతో నన్ను...

సమోసా నములుతుంటే ప్రాణాలు తోడేస్తున్న ట్టుగా నొప్పి, నరాలు జివ్వుమంటూ బాధ. కళ్లు బైర్లు కమ్మినట్టుగా తోచింది. 'మిమ్మల్ని ఎవరైనా బలంగా కొట్టారా?' డెంటిస్టు ప్రశ్న చెవుల్లో గింగురుమంది.

ఎవరు కొట్టారు నన్ను? ఎప్పుడు తాకింది నాకు దెబ్బ? నా మస్తిష్కంలో తుఫానులా రేగిన జ్ఞాపకాల అలజడి.

ఏంజెల్: ఉష్, ఎవ్వరూ కదలొద్దు (చేయెత్తింది).

కొడుతుందా జంతువుని? ఏంజెల్... తెల్లటి మెరిసే డ్రెస్సు, కుచ్చుల కిరీటం, భుజాలకు రెక్కలు... హుందాగా, గర్వంగా ఉంది. ఎంత చక్కగా, ముద్దుగా నటిస్తోంది మా అనుపమ! అచ్చం మా అమ్మలాగే ఉంది. ఔను, నా తల్లి ఎదురుగా నిలబడి ఉంది. అప్రయత్నంగా దవడలు ఒత్తుకున్నాను ఎడమచేత్తో.

*

పొద్దుగూకింది. కార్మికవాడలో చీకట్లు ముది రాయి. మాపటి వంటలు ఉడుకుతున్న వాసన క్వార్టర్ల లోంచి వస్తోంది. కొన్నిచోట్ల రాకాసి బొగ్గు కుంపట్లు ఇంకా రగులుతున్నాయి. నేను చెక్కగేటు తోసుకొని ఇంట్లోకి ప్రవేశించి, గుమ్మంలోంచే పుస్తకాలు మంచం

మీదికి విసిరాను. ఇంటి వెనుకకు వెళ్లి నీళ్లగోలెం దగ్గర కాళ్లేతులు శుభ్రంగా కడుక్కొని, "అమ్మా! అన్నం పెట్టు," అంటూ వంటింట్లో కాలు మోపాను.

"ఆగు అక్కడే నిలబడు," గద్దించింది అమ్మ. శనివారం సాయంకాలం స్వామివారి గుడికి వెళ్లి వచ్చిన ట్టుంది- ఎర్రంచు బీరపూరంగు చీర, సిగలో పూలు, బొట్టు మీద బొట్టు, అగరొత్తుల వాసన. కిరసనాయిలు లాంతరు అప్పుడే వెలిగించి చేత పట్టుకొంది.

"చదువుకుంటానని వెళ్లి ఎక్కడెక్కడ తిరిగావు నిన్న?" అంటూ లాంతరు కిటికీ తిన్నె మీద పెట్టింది. గుడ్లురిమి చూసింది.

"రమేష్‌గాడి ఇంట్లో చదువుకున్నాం అందరం," అన్నాను.

"బద్మాష్! అబద్ధాలాడతావా..." అంటూ చేయి లేపింది. తప్పించుకునేందుకు తల చటుక్కున పక్కకు వాల్చాను. ఆమె అసంకల్పితంగా రెట్టింపైన కోపంతో మరో చేత్తో నా ముఖం మీద మోదింది. ముంజేతి గాజుల వరుస, కడియం నా మూతికి తగిలాయి. ముందరి పళ్లు కదిలి నోట్లో రక్తం ఊరింది. ఏడుస్తూ కిందపడి దొర్లాను.

అమ్మ తల్లడిల్లిపోయింది. ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఉప్పునీళ్లు, దూదితో తుడిచి నా గదువ కాపడం పెడుతూ అంది, "రసూల్ మామ, బీబీ అత్త ఎంతగా ఏడుస్తున్నారో తెలుసా? పాపం సలీం ఆస్పత్రి లో బెడ్ మీద పరీక్షలు పరీక్షలు అంటూ పలవరి స్తున్నాడు. అయినా, వాణ్ణి సీసం పెంకుల్లోకి తోసెయ్యా లన్న పాడు ఆలోచన నీకెందుకొచ్చింది... ఇలాంటి తప్పు ఇంకెప్పుడూ చెయ్యకు."

*

ఓపెన్ ఎయిర్ థియేటర్ కాంతికొలనులాగా జిగేల్మంటోంది. సన్నగా రణగొణధ్వనులు మొదల య్యాయి. 'ఉగాది వారోత్సవాలు- టౌన్‌షిప్ సంక్షేమ సమితి,' అని రాసున్న ఆకుపచ్చ బేనర్ కింది సిల్కు తెరలు తొలగి స్టేజి దేదీప్యమానంగా వెలుగుతోంది. బహుమతి ప్రదాన కార్యక్రమానికి రంగం సిద్ధమైంది. విశిష్ట అతిథులు- జనరల్ మేనేజర్ గారి సతీమణి, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ఒక ప్రసిద్ధ కళా కారుడు, సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ తదితరులు స్టేజి అలంకరించారు.

వివిధ అంశాల్లో విజేతలైన వాళ్లకు మేడంగారు బహుమతులు అందజేస్తున్నారు. నాటికల విభాగం వంతు వచ్చింది. నేను శకుంతలవైపు చూశాను. మేకప్ తీసేసిన అనుపమ భుజాల మీద చేతులు మోపి, సీట్ల వరుసల మధ్య దోవలో రెడీగా నిలబెట్టింది. ఇద్దరి కళ్లల్లో ఉత్కంఠ. అమితమైన ఆశ. కన్నడు కుర్చీ ఎక్కి నిలబడ్డాడు. కరతాళ ధ్వనులు మిన్నుముడుతున్నాయి. కళాకారుడు విజేతల పేర్లు ప్రకటించాడు. 'బెస్ట్ ఛైల్డ్ ఆర్టిస్ట్'గా మర్కట పాత్రధారి ఎంపికయ్యాడు.

ఆశాభంగం చెందిన అనుపమ కళ్లనీళ్ల పర్యంత మైంది. నేను ఎత్తుకొని ఓదార్చాను. "టేకిట్ ఈజీ. బి స్పోర్టివ్ బేబీ! నువ్వు బాగా నటించావు. కోతివేషం వేసిన పిల్లవాడు ఇంకా చక్కగా నటించాడు... అని జడ్జిల అభిప్రాయం. ప్రతిభని నిర్ణయించడానికి వాళ్లు నిర్ణీత ప్రమాణాల్ని తప్పనిసరిగా పాటించాలి. యు ఇన్‌స్పైర్డ్ మి. అది చాలు."

"ఎక్కడ్నుంచి పిలిచారండీ ఈ కళాకారుడ్ని? వాడికి నటన అంటే ఏమిటో తెలుసా? ఆ కోతిగాడి అయ్యకు చుట్టమా ఏంటి?" శకుంతల తిట్లు అందు కుంది.

ఆమెని నిశ్శబ్దంగా ఉండమని హెచ్చరించి బయటికి దారితీశాను. ఒక్క క్షణం ఆగి విశిష్ట అతిథుల ఎన్‌క్లోజర్‌లోకి చూశాను. చీఫ్ ఇంజనీర్ భార్గవ నావైపే చూస్తున్నాడు. నిర్భయంగా చూపుల్లో చూపులు కలి పాను. మామధ్య యుద్ధం నడుస్తుంది. నావద్ద ఉన్న అస్త్రశస్త్రాలు తక్కువే అని నాకు తెలుసు. అయినా వెనుకంజ వేయను.

"ఏమిటంత హుషారు? ఇందాకనేమో ముక్కుతూ మూల్గారు," అంటోంది శకుంతల.

"నా లీవు కేన్సిల్ అయింది. రేపు డ్యూటీలో చేరాలి," చెప్పాను థియేటర్ బైటికొచ్చి.

*ఈవారం జనవార్త , 24 ఫిబ్రవరి, 2 మార్చి 2008*

